వైఎస్ఆర్

పశు వైద్య విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-కడప అర్బన్ : పశు వైద్య విద్యార్థులపై కక్ష సాధింపు చర్యలను అధికారులు మానుకోవాలని, న్యాయమైన డిమాండ్‌ను తక్షణమే పరిష్కరించాలని పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పశు వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు తమ సమస్యలను పరిష్కరించాలని నెల రోజుల నుంచి ఆందోళన కార్యక్రమాల నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. వెటర్నరీ చదువుతున్న విద్యార్థులు తమకు ప్రభుత్వం ఇచ్చే స్టైఫండ్ రూ.7 వేలు, పీజీ విద్యార్థులకు రూ.9 వేలు, పిహెచ్‌డి విద్యార్థులకు రూ.10 వేలు మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. 2013 నుంచి ఇప్పటి వరకు స్టైఫండ్‌ను పెంచలేదని చెప్పారు. సాధారణ వైద్య విద్యార్థులకు రూ.25 వేల నుంచి రూ.60 వేల వరకు స్టైఫండ్ ఇస్తున్నారని పేర్కొన్నారు. పశు వైద్య విద్యార్థులకు వ్యత్యాసం దారుణమన్నారు. కార్యక్రమంలో నాయకులు జగదీశ్వర్‌రెడ్డి, శివప్రసాద్, సుదర్శన్ పాల్గొన్నారు.

అంగన్వాడీల 'చలో విజయవాడ'.. అడ్డుకున్న పోలీసులు

- కడప, మైదుకూరులో పోలీసుల నిర్బంధం
- 41 మంది అరెస్టు..విడుదల

ప్రజాశక్తి-కడప ప్రతినిధి/చాపాడు/కడప అర్బన్

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీలు చలో విజయవాడకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, మినీ వర్కర్లు వైఎస్ఆర్ జిల్లా నుంచి విజయవాడకు ఆదివారం బయలుదేరారు. పలుచోట్ల వారిని పోలీసులు ఎక్కడికక్కడ విజయవాడకు వెళ్లకుండా అడ్డుకోవడాలు, గృహనిర్బాంధాలు చేయడం వంటివి చోటుచేసుకున్నాయి. మైదుకూరు నుంచి బయలుదేరిన అంగన్వాడీ టీచర్లను, ఆయాలను, మినీ వర్కర్లను ఆదివారం మైదుకూరు పోలీసులు అరెస్టు చేసి వారిని పోలీసుస్టేషన్‌లో ఉంచారు. అంగన్వాడీ కార్యకర్తలు, సిబ్బంది తమ నిరసన కార్యక్రమాన్ని స్టేషన్‌లోనే తమ నిరసన తెలియజేస్తున్నారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ధనలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని కోరుతున్న ప్రభుత్వం స్పదించడం లేదన్నారు. చలో విజయవాడ కార్యక్రమాన్ని ఉద్దేశ పూర్వకంగానే ప్రభుత్వం పోలీసుల సహాయంతో అడ్డుకునే ప్రయత్నం చేయడం దారుణమన్నారు. అంగన్వాడీ సిబ్బంది సమస్యల పరిష్కారానికి దశల వారి పోరాటం ఆగదని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు జి.లక్ష్మీదేవి, కె.వెంకటసుబ్బమ్మ, ఎం.లక్ష్మీదేవి, సిబ్బంది పాల్గొన్నారు. కడప రైల్వేస్టేషన్ నుంచి బయలు దేరిన అంగన్వాడీ కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కడపలో 20 మంది, మైదుకూరులో 21 మందిని

చాపాడు : మైదుకూరు పోలీసు స్టేషన్‌లో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

ఏడు గంటలకు వరకు నిర్బంధించారు. అంగన్వాడీలు విజయవాడలోని రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు వెళ్తున్న సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆందోళనకు అనుమతి ఉన్నప్పటికీ పోలీసులు అక్రమంగా అంగన్వాడీలను నిర్బంధించడం ఏమిటనే విమర్శ ప్రజాసంఘాల నుంచి వినిపిస్తోంది.

అక్రమ అరెస్టులతో పోరాటాలను ఆపలేరు

అంగన్వాడీలు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని గత ప్రభుత్వ కాలంలో 42 రోజులు సమ్మె సందర్భంగా ఒప్పంద చేసిన డిమాండ్లను కూటమి ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో ఈనెల 10న చలో విజయవాడ కార్యక్రమం పోలీసులు ఒక ప్రక్క అనుమతి ఇచ్చి, మరోపక్క జిల్లాలలో ఎక్కడికక్కడ అరెస్టు, గృహ నిర్బంధం, నోటీసులు అందజేయడాన్ని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్ తీవ్రంగా ఖండించారు. ఆదివారం స్థానిక హోచిమిన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ చలో విజయవాడకు తరలి వెళుతున్న నాయకులను, కార్యకర్తలను, ఆయాలను ప్రభుత్వం పోలీసుల చేత అరెస్టు చేయించడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని, సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరడం తప్పా అని ప్రశ్నించారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని, ఇలాంటి చర్యలు ప్రభుత్వానికి మంచిది కాదని హితవు పలికారు. అక్రమ అరెస్టులను ఖండిస్తూ ప్రజా ఉద్యమాలపై అణచివేత ధోరణి తగదన్నారు. తమ న్యాయమ్కైన డిమాండ్లపై అంగన్వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించేంత వరకు ఉద్యమం ఆపేదే లేదని చెప్పారు. సమావేశంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు జి.వేణుగోపాల్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ కె.సి.బాదుల్లా పాల్గొన్నారు.

కడపలో అంగన్వాడీలను రైలు ఎక్కకుండా ఆపిన పోలీసులు

వక్ఫ్ చట్ట సవరణ రాజ్యాంగ విరుద్ధం

- రద్దు చేసేంత వరకూ పోరాటాలు
- ర్యాలీలో జెఎసి నాయకుల హెచ్చరిక

ప్రజాశక్తి-కడప

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ బోర్డు చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కడప జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. నగరంలోని రవీంద్రనగర్ యుఎస్ మహల్ ఫంక్షన్ హాల్ నుంచి ఏడు రోడ్ల సర్కిల్ వరకు ర్యాలీ సాగింది. కేంద్ర, రాష్ట్ర కూటమి పార్టీలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినదించారు. ఈ సందర్భంగా చేసిన జెఎసి నాయకులు మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు చట్టం రద్దు చేసేంత వరకు పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధంగా పరిపాలన చేస్తోందని ధ్వజమెత్తారు. దేశంలో ఉండే ప్రజలను హిందూ, ముస్లిం అంటూ బిజెపి గొడవలు, అల్లర్లు సృష్టిస్తుందని పేర్కొన్నారు. వక్ఫ్ సవరణ చట్టం 2024 రద్దు చేయకపోతే దేశవ్యాప్తంగా మరింత నిరసన కార్యక్రమాలు చేపడతామని బిజెపిని, ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు బాబు భాయ్, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు అఫ్జల్‌ఖాన్, ముఫ్తీ రహిముల్లా ఖాన్‌సాహెబ్, సిపిఎం జిల్లా కార్యదర్శి

ర్యాలీ నిర్వహిస్తున్న జెఎసి నాయకులు

చంద్రశేఖర్, సిపిఐ నాయకులు చంద్ర, భాస్కర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ అలీఖాన్, కాంగ్రెస్ పార్టీ నగర్ ఉపాధ్యక్షులు హమీద్, కాంగ్రెస్ నాయకుల గౌస్ పీరు, మౌలానా జాకీర్ సాహెబ్, ఎస్‌డిపిఐ నాయకులు, ఇతర పార్టీ నాయకులు, కడప నగర ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రాములోరి కల్యాణానికి వైభవంగా ఏర్పాట్లు

- టిటిడి చైర్మన్ బి.ఆర్.నాయుడు

బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న టిటిడి చైర్మన్ బి.ఆర్.నాయుడు, జెఇఒ

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

శ్రీ కోదండరామ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 11న జరిగే శ్రీ సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని టిటిడి చైర్మన్ బి.ఆర్.నాయుడు తెలిపారు. ఒంటిమిట్టలోని పరిపాలనా భవనంలోని సమావేశ మందిరంలో టిటిడి జెఇఒ వి.వీరబ్రహ్మం, జిల్లా అధికారులతో ఆదివారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒంటిమిట్టలో జరిగే శ్రీ సీతారాముల కల్యాణాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని తెలిపారు. అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు. టిటిడి అధికారులు, కడప జిల్లా అధికారులు సమన్వయంతో ప్రణాళికా బద్ధంగా, నిర్మాణాత్మకంగా ఏర్పాట్లు చేయాలని కోరారు. భక్తులకు అందరికీ ముత్యాల తలంబ్రాలు, ప్రసాదాలు అందేంచేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి ఏడాది సీతారాముల కళ్యాణానికి భక్తుల సంఖ్య పెరుగుతోందని, భక్తుల తాకిడికి తగ్గట్టుగా సౌకర్యాలు కల్పించాలన్నారు. టిటిడి విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ, పోలీసులు సమన్వయంతో పనిచేయాలన్నారు. శ్రీ సీతారాముల కల్యాణం రోజున ఎలాంటి విద్యుత్ అంతరాయం కలగరాదని, అవసరమైన జనరేటర్లు ఏర్పాటు చేయాలన్నారు. వేసవి నేపథ్యంలో అగ్ని మాపక శాఖ మరింత అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఆహ్వానం పత్రికలు అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులకు సేవలు అందించేందుకు అవసరమైన శ్రీవారి సేవకులను ఏర్పాటు చేయాలని, భక్తులను ఆకట్టుకునేలా పుష్పాలంకరణ, విద్యుత్ అలంకరణలు, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. భక్తులకు తాగునీరు, మజ్జిగ, అన్నప్రసాదాలు విరివిగా పంపిణీ చేయాలని కోరారు. అత్యవసర వైద్య సేవలు, అవసరమైన మందులు నిల్వ ఉంచాలన్నారు. శాఖలవారీగా అధికారులు చేయనున్న పనులను చైర్మన్‌కు నివేదించారు. అంతకు ముందు కల్యాణ వేదిక ప్రాంగణాన్ని టిటిడి చైర్మన్ అధికారులతో కలిసి పరిశీలించారు. కల్యాణ వేదిక ప్రాంగణాన్ని చక్కని పుష్ప, విద్యుత్ అలంకరణలతో అలంకరించాలని సూచించారు. భక్తుల ప్రవేశం, నిష్క్రమణ మార్గాల్లో పటిష్టంగా భద్రతాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. గత అనుభవాలను ద ృష్టిలో ఉంచుకుని వేసవి నేపథ్యం, అనుకోకుండా వర్షం వచ్చినా ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ నెల 15న అమరావతిలో శ్రీనివాస కల్యాణోత్సవం నిర్వహించడానికి ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమావేశంలో కడప ఆర్‌డిఒ జాన్ ఇర్విన్, డిఎస్‌పి వేంకటేశ్వర్లు, టిటిడి డిప్యూటీ ఇఒలు నటేష్ బాబు, ప్రశాంతి, గోవింద రాజన్, సెల్వం, ఎస్ ఇలు వేంకటేశ్వర్లు, మనోహర్, అడిషనల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సునీల్ కుమార్, విజిఒ సదాలక్ష్మి, అసిస్టెంట్ జిల్లా ఫైర్ ఆఫీసర్ వి.ఆదినారాయణరెడ్డి, సేల్స్ వింగ్ ప్రత్యేక అధికారి రామరాజు, ఎఇఎస్ఒ వై.సతీష్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు

శాస్త్రోక్తంగా మహాసంప్రోక్షణ : ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం శాస్త్రోక్తంగా మహాసంప్రోక్షణ నిర్వహించారు. ఉదయం భగవత్పుణ్యాహం, మూర్తి హోమం, శ్రీమద్రామాయణ హోమం, పంచసూక్తం పవమాన హోమాలు నిర్వహించారు. మహా పూర్ణాహుతి, వృషభ లగ్నంలో మహా సంప్రోక్షణ, మహా కుంభాభిషేకము, స్వర్ణ పుష్పార్చన శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతించారు.

బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ : ఒంటిమిట్ట శ్రీకోదండరామ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల పోస్టర్లు, ఆలయ చరిత్ర తెలియజేసే కరపత్రాలను ఆలయంలో టిటిడి చైర్మన్ బి.ఆర్.నాయుడు, జెఇఒ వి.వీరబ్రహ్మంతో కలిసి ఆలయం ముందు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 6వ తేదీన శ్రీరామనవమి, పోతన జయంతి, ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఏప్రిల్ 9న హనుమంత వాహనం, ఏప్రిల్ 10న గరుడవాహనం, ఏప్రిల్ 11న శ్రీసీతారాముల కల్యాణం, ఏప్రిల్ 12న రథోత్సవం జరుగనున్నాయని తెలిపారు. ఈ ఉత్సవాలకు విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొనాలని కోరారు. అనంతరం శ్రీ విశ్వావసు నామ సంవత్సర పంచాంగాన్ని ఆవిష్కరించారు.

సమృద్ధిగా ఇసుక నిల్వలు

- జిల్లాలో 10 వేల టన్నులు సిద్ధం
- అక్రమ రవాణా నిరోధానికి ప్రత్యేక అధికారాలు
- మైన్స్ డిడి సి.హెచ్.సూర్యచంద్రరావు వెల్లడి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో ఇసుక నిల్వలు పుష్కలంగా ఉన్నాయి. జిల్లాలోని 10 ఇసుక రీచ్‌ల నుంచి ఇసుక లభ్యత గణనీయంగా పెరుగుతోంది. ప్రస్తుతం రోజుకు 10 లక్షల మెట్రిక్ టన్నుల మేర లభిస్తోంది. లభ్యతకు తగిన డిమాండ్ ఉండడం లేదు. సామాన్యులకు అవసరమైన ఉచిత ఇసుకను సరఫరా చేస్తున్నాం. ఇసుక అక్రమ రవాణా నిరోధంపై దృష్టి సారించాం. పోలీసులు, రెవెన్యూ, మైన్స్ తనిఖీ అధికారులకు డెలిగేషన్ అధికారా లివ్వడమైంది.ఎక్కడై నా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతూ పట్టబడిన వారిపై కేసు లు నమోదు చేయడం జరుగుతుందని పేర్కొంటున్న మైన్స్ డిడి సి.హెచ్.సూర్యచంద్రరావుతో ముఖాముఖి..

ఇసుక రీచ్‌ల వివరాలు తెలపండి?

జిల్లాలో 10 ఇసుక రీచ్‌లు ఉన్నాయి. పైడికాల్వ, మాచనూరు, కొత్తగంగిరెడ్డిపల్లి, నందిమండలం, తంగేడుపల్లి, కొండూరు, విభరాపురం, మారెళ్లమడక, గొల్లపల్లి, బెడుదూరు రీచ్‌లు ఉన్నాయి. ఏడు అదనపు రీచ్‌లు పబ్లిక్ హియరింగ్ దశలో ఉన్నాయి.

జిల్లాలో ఇసుక లభ్యత ఎంత?

జిల్లాలోని 10 ఇసుక రీచ్‌ల నుంచి ఇసుక పుష్కలంగా లభిస్తోంది.

ప్రతి రోజూ సుమారు 10 లక్షల మెట్రిక్ టన్నుల మేరకు లభిస్తోంది. ఇసుక లభ్యతకు తగిన విధంగా సరఫరా ఉండడం లేదు.10 లక్షల టన్నులకు రెండు వేల టన్నుల మేర మాత్రమే గిరాకీ లభిస్తోంది.

డీసిల్టేషన్ పాయింట్ల వివరాలు తెలపండి?

జిల్లాలోని 10 ఇసుక రీచ్‌ల్లో ఏటూరు, పి.అనంతపురం రీచ్‌ల దగ్గర డీసిల్టేషన్ పాయింట్లను ఏర్పాటు చేయడమైంది. ఇక్కడి నుంచి ఆయా ప్రాంతాలకు ఇసుకను సరఫరా చేయడం జరుగుతుంది.

ఇసుక అక్రమ రవాణా నివారణకు తీసుకుంటున్న చర్యలేమిటి?

జిల్లాలో ఇసుక అక్రమ రవాణా నివారణపై దృష్టి సారించాం. పోలీస్, రెవెన్యూ, మైన్స్ అధికారులకు ప్రత్యేక అధికారులు ఇవ్వడమైంది.

జిల్లాలోని క్వారీలు వివరాలు తెలపండి?

జిల్లాలో 14 మేజర్, 130 మైనర్ క్యారీలు ఉన్నాయి. ప్రతి ఏటా లీజుల గడువు ముగిసిన క్వారీల నిర్వాహకులు రెన్యువల్ చేసు కోవాల్సి ఉంది.

మైనింగ్ ఆదాయం వివరాలు తెలపండి?

జిల్లా మైనింగ్ డిపార్టుమెంట్ రూ.241 కోట్ల మేరకు ఆదాయాన్ని ఆర్జించాల్సి ఉంది. ఈనెలాఖరు నాటికి పూర్తి ఆదాయం వివరాలను వెల్లడించడం జరుగుతుంది.

రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలి

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

అమ్మిన సరుకుకు ప్రతి ఒక రైతుకు కొనుగోలు బిల్లు ఇవ్వాలని పేర్కొన్నారు, బద్వేలు వ్యవసాయ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజు. ఆదివారం వ్యవసాయ పరిశోధన స్థానం ఊటుకూరులో కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన ప్రయివేటు ఇన్పుట్ డీలర్లకు దేశీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అమ్మకాలు, నిల్వలో సంబంధిత చట్టాలు, క్లాసెస్, షెడ్యూల్స్, సెక్షన్స్, ఫార్మ్ గురించి వివరించారు. ప్రతి రైతుకు కొన్న పరిమాణానికి తప్పని సరిగా రసీదుతో పాటు, నాణ్యమైన ఉత్పాదకాలు, గరిష్ట అమ్మకపు ధరకు లోబడే అమ్మాలన్నారు. సక్రమంగా రికార్డ్స్,రిజిస్టర్‌లు నిర్వహిస్తూ వ్యవసాయ అధికారుల ఆదేశాలు, సూచనలూ సలహాలూ పాటించి, నమూనాల సేకరణకు, నాణ్యత పరీక్షలకు సహకరించి ధరల, స్టాక్ పట్టిక ప్రదర్శించాలన్నారు. లైసెన్సును షాప్‌లో రైతులు చూసే విధంగా ప్రదర్శించాలని తెలిపారు. నిషేధిత పురుగు, కలుపు మందులను అమ్మరాదని చెప్పారు. గడువు ముగిసిన పురుగు మందులను ఎట్టి పరిస్థితుల్లో అమ్మ కూడదన్నారు. బస్తాల తుకాలలో వ్యత్యాసం ఉండకూడదన్నారు. లైసెన్సులను సకాలంలో రెన్యువల్ చేయించు కోవాలని పేర్కొన్నారు.

500 మంది పేదలకు నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి కడప అర్బన్

నగరంలోని అగాడి వీధిలో ఉన్న అర్రహ్మాన్ సొసైటీ కార్యాలయంలో రిటైర్డ్ డిప్యూటీ కోఆపరేటివ్ రిజిస్టర్ సయ్యద్ జాఫర్ హుస్సేన్ ఆధ్వర్యంలో పేదలకు నిత్యవసర సరుకులు పంపిణీ కార్యక్రమాన్ని అర్రహ్మాన్ ఇందాద్ వెల్ఫేర్ సొసైటీ ప్రెసిడెంట్ షేక్.మహబూబ్ బాషా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్రమైన రంజాన్ మాసం పురస్కరించుకుని దాదాపు 500 మందికి రూ.4 లక్షలతో రంజాన్ నిత్యవసర సరుకుల కిట్లను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. పేదలకు సేవ చేస్తున్న సయ్యద్ జాఫర్ హుస్సేన్ అభినందనీయుడని ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సి.జమాల్ బాషా, పలువురు ప్రముఖులు, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

రంజాన్ కిట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ జమాల్ బాషా

పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

12న యువత పోరు : వైసిపి

ప్రజాశక్తి - కడప

విద్యార్థులకు మేలు జరగాలంటే కూటమి ప్రభుత్వం కూసాలు కదిలే రీతిలో "యువత పోరు" కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైసిపి కడప జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్ రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధా పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం వైసిపి కడప జిల్లా కార్యాలయంలో ఈ నెల 12వ తేదీన నిర్వహించబోయే "యువత పోరు" వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల్ని చెల్లించకుండా విద్యార్థులను చదువుకు దూరం చేయాలని చూస్తున్న కూటమి ప్రభుత్వం తక్షణమే కపట నాటకాలు కట్టి పెట్టాలని హెచ్చరించారు. లేదంటే విద్యార్థులు తిరగబడడం ద్వారా తలెత్తే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆలస్యం చేయడం వల్ల వారు చదువులు ఆపాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీని పర్యవసానం సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై తీవ్రమైన ప్రభావం చూపుతుందన్నారు. పిల్లల ఫీజులకు అవసరమైనంత డబ్బులు లేక తల్లిదండ్రులు అప్పులు చేయడం జరుగుతోందని ఆరోపించారు. ఇది మంచి పరిణామం కాదని వారు అభిప్రాయపడ్డారు. 2018-19లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం బకాయి పెట్టి పోయిన రూ. 1,800 కోట్ల రూపాయలను వైసీపీ ప్రభుత్వమే చెల్లించిన వాస్తవాన్ని గుర్తుకు చేశారు. అదే విధంగా 2023-24లో ఎన్నికల కోడ్ కారణంగా ఏర్పడిన బకాయిలు చెల్లించాల్సిన బాధ్యత నుంచి ప్రస్తుత కూటమి ప్రభుత్వం పక్కకు తప్పుకోవడం సమంజసం కాదని హితవు పలికారు. ఆ బకాయిలతో కలిపి, ఇప్పటి వరకు రూ.3,900 కోట్లను ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని వివరించారు. లక్షల మంది విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు సంబంధించిన ఈ అంశంలో ఇంకా జాప్యం చేయకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన డబ్బులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇదే విషయమై మార్చి 12వ తేదీన జరుగనున్న యువత పోరును విద్యార్థులు, వారి తల్లిదండ్రులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సుబ్బారెడ్డి, వైసిపి నాయకులు పులి సునీల్ కుమార్, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు సాయి దత్త, కడప నగర విద్యార్థి విభాగం అధ్యక్షుడు శివారెడ్డి, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

పేదలకు అన్నం వడ్డిస్తున్న మహేష్

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి - కడప : విద్యార్థుల భవిష్యత్తు కాపాడే బాధ్యత తల్లిదండ్రులపైనే ఉందని, పరీక్షల సమయంలో విద్యార్థులు అసహనానికి గురికా కూడదని పాస్టర్ పి.మహేష్ అన్నారు. ఆదివారం కడప నగరం 48 డివిజన్ కృపా కాలనీలో న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ అధ్యక్షులు పి.మహేష్, సిస్టర్ శాంతమ్మల ఆధ్వర్యంలో పరీక్షలు రాస్తున్న విద్యా ర్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం పేదలకు చీరలు పంపిణీ చేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పి.రవితేజ, వెంకట రమణ, శాంతిరాజు, రోజా, గోకారి, ఎ.అగస్టిన్, నరసయ్య, రామంజినమ్మ, అంజలి, రమణమ్మ, సుగుణమ్మ, ఎల్లమ్మ పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాలలను పరిరక్షించాలి : రూట

ప్రజాశక్తి-కడప అర్బన్ : దేశ స్వాతంత్రానికి ముందు నుంచి రాష్ట్రంలో ఉర్దూ పాఠశాలలు ఉన్నాయని, వాటన్నింటినీ పరిరక్షించి అభివృద్ధి పరిచే బాధ్యత ప్రభుత్వంపై ఎంతైనా ఉందని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూట) ఉర్దూ పాఠశాలల పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్లు ఎ.ఇస్మాయిల్, సయ్యద్ రహమతుల్లా, రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ ఖాన్ సలీంఖాన్ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని మైనర్ మీడియా ఉర్దూ, తమిళం, కన్నడ, ఒరియా పాఠశాలల అభివృద్ధికై ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని, 117 జిఒ రద్దు అనంతరం రూపొందించే ఉత్తర్వులలో మైనర్ మీడియా పాఠశాలలకు కొన్ని మినహాయింపులు తప్పకుండా ఉండాలని పేర్కొన్నారు. రాబోయే మెగా డిఎస్‌సిలో ఉర్దూ పాఠశాలల ఉపాధ్యాయ ఖాళీలన్నీ భర్తీ చేయాలని పేర్కొన్నారు. గతంలో మూడు డిఎస్‌సిలు నిర్వహించారని, భర్తీకి నోచుకోని బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేసి నిరుద్యోగ యువతకు ఆదుకోవాలని తెలిపారు. పేద పిల్లల చదువులకు భరోసా కల్పించాలని పేర్కొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి-కడప

కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ కార్యాలయాల్లో కూడా కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు ఉదయం 10 గంటల నుండి అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

మహాధర్నాను జయప్రదం చేయండి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్

ప్రజాశకి- కడప అర్బన్

విజయవాడలో చేపట్టనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వి.అన్వేష్ పిలుపునిచ్చారు. ఉపాధి హామీ పనులు వంద రోజులు పూర్తి చేసుకున్న గ్రామీణ పేదలకు అదనంగా పనిదినాలు, వేసవి అలవెన్సులు, పేస్లిప్పులు, పెండింగ్ వేతనాలు, గడ్డపారలు, పనిముట్లు, నీళ్లకు మజ్జిగ యథావిధిగా అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే ఇవ్వాలని ఈ నెల 12వ తేదీన విజయవాడ ధర్నా చౌక్‌లో మహాధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం కడప ప్రజా సంఘాల కార్యాలయంలో వ్యవసాయ కార్మికుల ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వి.అన్వేష్ మాట్లాడుతూ వలస కార్మికులకు ఉచితంగా రవాణా సౌకర్యం, నాణ్యమైన బియ్యం, గ్యాస్ బండ అందించాలని కోరారు. ప్రమాదాల్లో చనిపోయిన కుటుంబాలకు రూ.25 లక్షల నగదు, రెండు ఎకరాల ప్రభుత్వ భూమి ఇవ్వాలని పేర్కొన్నారు. భూమిలేని ప్రతి పేద కుటుంబానికి ఏడాదికి రూ.12 వేల నగదు, మూడు సెంట్లు స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.6 లక్షలు నగదుతో పాటు ప్రతి దళిత కాలనీకి రెండు ఎకరాల స్మశాన స్థలం కేటాయించాలని పేర్కొన్నారు. ఉపాధి హామీ మేట్లకు పారితోషికం ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో రెండు కోట్ల మంది పేదలు గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తున్నారని తెలిపారు. వీరికి సొంత ఆస్తులు లేక, చదువుకున్న వారికి ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లేక నిత్యం పొట్టకూటి కోసం ఏ పని దొరికితే ఆ పనికి డిగ్రీ ఫీజు చదువుకున్న పిల్లలు కూడా ఆటో, భవన నిర్మాణ, ఉపాధి పనులకు వెళ్తున్నారని పేర్కొన్నారు. పనుల్లో కూడా పోటీ పెరిగి చేతినిండా పనులు దొరకక సుదూర ప్రాంతాలకు వలసలు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు ఉపాధి హామీ పెద్దవరం లాంటిదని, అటువంటి ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డబ్బులు కాబట్టి తగ్గించాయని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఉపాధిని వ్యవసాయానికి అనుసంధానం చేసి పేదల పొట్ట కొడుతుందన్నారు. ప్రజా పంపిణీలో 13 రకాల నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలని పేర్కొన్నారు. వల్లూరు మండలం అంబవరం గ్రామానికి చెందిన పుల్లమ్మ ఉపాధి హామీ పనిచేస్తూ గుండెపోటుతో చనిపోయిందని తెలిపారు. ఆమె కుటుంబానికి ప్రభుత్వం రూ.6 లక్షల ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, రామ్మోహన్, సత్యనారాయణ, భైరవ ప్రసాద్, విద్యార్థి, యువజన, నాయకులు చిన్ని, శివకుమార్, రాహుల్, రవి, రఘు, మహిళా సంఘం నాయకురాలు గౌసియా బేగం, కామేశ్వరమ్మ పాల్గొన్నారు.

మహాధర్నా కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

మాట్లాడుతున్న బాలాజీ హైస్కూల్ డైరెక్టర్ బైరెడ్డి రవీంద్రారెడ్డి

'పది'తో చక్కటి ప్రణాళిక వేసుకోండి

- బాలాజీ హైస్కూల్ డైరెక్టర్ బైరెడ్డి రవీంద్రారెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

భవిష్యత్తుకు చక్కటి ప్రణాళిక పదవ తరగతి మార్కులతోనే వేసుకోవాల్సి ఉంటుందని బాలాజీ హైస్కూల్ డైరెక్టర్ బైరెడ్డి రవీంద్రారెడ్డి సూచించారు. స్థానిక బాలాజీ హైస్కూల్‌లో ఆదివారం తొమ్మిదవ తరగతి విద్యార్థులు పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రారెడ్డి మాట్లాడుతూ భయాన్ని వదిలి ప్రతి సబ్జెక్టును ఇష్టపడి చదవాలన్నారు. తల్లిదండ్రుల కోసమో, ఉపాధ్యాయుల కోసం చదవద్దని మీకోసం, మీ భవిష్యత్ కోసం చదవాలన్నారు. గతంలో 590 క్రాస్ చేసిన విద్యార్థికి ఆ సంవత్సరం ఫీజును తిరిగి ఇచ్చామన్నారు. ఈ ఏడాది కూడా టౌన్ ఫస్ట్ వచ్చిన విద్యార్థికి పూర్తిగా ఫీజు వెనక్కి ఇస్తామన్నారు. పదిలో గ్రేడ్‌లో కానీ మార్కులల్లో కానీ మన స్కూల్ విద్యార్థులు సాధించిన తర్వాతనే మిగతా విద్యార్థులు ఉంటారన్నారు. ఎఒ కెవివి ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఎదిగేకొద్దీ ఒదిగి ఉండాలన్నారు. సమాజంలో విలువలు పాఠశాల స్థాయిలోనే నేర్చుకుంటారని, వాటిని జీవితాంతం పాటించాలన్నారు. మీరు సాధించే ఉత్తమమైన మార్కులు మీ తల్లిదండ్రులను, మమ్మల్ని మాత్రమే సంతృప్తి పరుస్తాయన్నారు. అవి మీ జీవితానికి బాటలు వేస్తాయన్నారు. అనంతరం భరత్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు సూర్యమిత్ర, సీనియర్ ఉపాధ్యాయులు ఖాసీం, ప్రిన్సిపల్ శిరీష, పదవ తరగతి ఉపాధ్యాయులు మాట్లాడారు. పాఠశాలలోని విద్యార్థుల నుంచి సమాజ సేవలో భాగస్వాములై 'నేనున్నాను సేవ చేయడానికి' అని మే ఐ హెల్ప్ యు ఫౌండేయన్‌ను స్థాపించి ముందుకు సాగుతున్న ఆ సంస్థ చైర్మన్ మోరె లక్ష్మణ్‌రావుకు రూ.15,000 వితరణ చేశారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సీనియర్ ఉపాద్యాయులు సత్యానందం, ప్రసాద్, బాషా పాల్గొన్నారు.

సమాజ సేవలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలి

ప్రజాశక్తి - వేంపల్లె

సమాజ సేవలో విద్యార్థులందరూ భాగస్వామ్యం కావాలని ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి గోన ఇందుమతి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని నందిపల్లె గ్రామంలో ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటి ఎన్ఎస్ఎస్ యూనిట్-12 విద్యార్థులు సామాజిక అవగాహన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ అక్షరాస్యత, పర్యావరణ పరిరక్షణ, నకిలీ ఫోన్ కాల్స్ తదితర సామాజిక సమస్యలపై అవగాహన పెంచడంలో దృష్టి సాధించినట్లు తెలిపారు. ఎన్ఎస్-ఎస్ వాలంటీర్లతో ఇంటింటికి వెళ్లి అవగాహన ప్రచారాలు, గ్రామస్తులతో పరస్పర చర్చలు నిర్వహించినట్లు చెప్పారు. స్థిరమైన అభివృద్ధిలో సమాచార సంఘాల పాత్రను నొక్కి చెప్పారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు చేసిన సామాజిక అవగాహన కల్పించడంలో అంకితభావంతో పని చేసినందుకు అభినందించారు. సామాజిక బాధ్యత పట్ల నిబద్ధత గ్రామీణాభివృద్ధికి అర్థవంతంగా సహకరించేలా విద్యార్థులను ఎంతో ప్రోత్సహిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విద్యా వాలంటీర్లు పాల్గొన్నారు.

ముగ్గురు కౌన్సిలర్లు సొంత గూటికే..

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

గడచిన సార్వత్రిక ఎన్నికల అనంతరం వైసిపి నుండి తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్న ముగ్గురు కౌన్సిలర్లు ఆదివారం మళ్లీ వైసిపి గూటికి చేరుకున్నారు. ఎనిమిదో వార్డు కౌన్సిలర్ రాగుల శాంతి, 40వ వార్డు కౌన్సిలర్ అరుణ, 39వ వార్డు కౌన్సిలర్ అనిల్ కుమార్‌ను వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు ప్రసాద్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం రాచమల్లు మాట్లాడుతూ ఈ ముగ్గురు వైసిపి ఇంటికి రావడం సంతోషంగా ఉందన్నారు. మనకు పరాయి పంచన ఉండాల్సిన అవసరం ఎంత మాత్రం లేదన్నారు. పరాయి పంచన పరమాన్నం తాగే కంటే సొంత ఇంట్లో గంజి తాగడం మేలు అన్నారు. తమ కౌన్సిలర్ల పట్ల తాము ఎప్పటికీ ఒకే అభిప్రాయంతో ఉన్నా మన్నారు. నా ఆహ్వానాన్ని మన్నించి భేషరతుగా చేరిన ఆ ముగ్గురికి శుభాకాంక్షలు తెలిపారు. ఇంకా పదిమంది కౌన్సిలర్లు టిడిపి పక్షాన ఉన్నారని, వీరిని కూడా ఏ పార్టీతో గెలిచారో అందులోకి ఆహ్వానిస్తున్నామన్నారు. గడచిన కొంత కాలంగా తాము ఓర్పుతో ఉన్నామని, ఆ ఓర్పు ఫలితమే నేటి వాస్తవమన్నారు. కార్యక్రమంలో చేరిన కౌన్సిలర్లతోపాటు ఇతర కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాచమల్లు

క్రైం కార్నర్

టిడిపి నేతలపై కేసు నమోదు

ప్రజాశక్తి - వేంపల్లె

ఇంటిపై దాడి చేయడానికి వచ్చాడని చేసిన ఫిర్యాదు మేరకు టిడిపి నేతలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రంగారావు తెలిపారు. వేంపల్లెలోని సాయి నగర్‌లో నివాసం ఉంటున్న విజయ భారతి తన ఇంటికి పైకి దాడి చేయడానికి టిడిపి నేతలు వచ్చారని ఫిర్యాదు చేశారు. ఆ మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆటోను ఢీ కొన్న లారీ : ఎనిమిది మంది కూలీలకు గాయాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఆటోను లారీ ఢీకొన్న సంఘటనలో ఎనిమిది మంది కూలీలు గాయపడ్డారు. పట్టణ సమీపంలోని చిన్న రంగాపురం గ్రామం వద్ద ఉన్న ఫుడ్ అండ్ సైన్స్ కాలేజీ వద్ద ఆదివారం ఉదయం అరటికాయలు లోడ్‌కు వెళుతున్న ఢిల్లీ లారీ.. కూలీలు ప్రయాణిస్తున్న ఆటోను ఢీ కొంది. ఆటోలోని ఎనిమిది మంది కూలీలు గాయపడ్డారు. పట్టణంలోని రాజీవ్ నగర్ కాలనీ నుంచి కూలి పని నిమిత్తం 10 మంది ఇప్పట్ల గ్రామానికి వెళుతుండగా ఆటోను లారీ వెనుక వైపు నుంచి ఢీకొనడంతో ఆటో అదుపుతప్పి కంపచెట్లల్లో బోల్తా పడింది. గాయపడినవారిని చికిత్స నిమిత్తం పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రూరల్ సీఐ ఎన్వి రమణ, ట్రాఫిక్ సిఐ హాజీవలి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులతో ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు.

సంఘటన గురించి తెలుసుకుంటున్న పోలీసులు

బాత్రూంలో వృథా నీరు.. కదలని వైనం

పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతున్నా స్పందించని అధికారులు

బాత్రూంలో కుళాయి నుండి వృథాగా పోతున్న నీరు

ప్రజాశక్తి - వేంపల్లె

పదోతరగతి విద్యార్థులకు ఈనెల 17నుంచి పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా స్కూళ్లల్లో కనీస వసతులు కల్పించాలి. సరిగా లేని వాటికి మరమ్మతులు చేయించాలి. సంబంధిత అధికారులు మాత్రం ఇవేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాలిక పాఠశాలలో బాత్రూంలో మరమ్మతులు చేపట్టక పోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. బాలికల పాఠశాలలో ఉన్న బాత్రూంల్లో కుళాయిలు విరిగి పోవడంతో నీరు వృథాగా పోతోంది. బాత్రూంలోని పైపులు బ్లాక్ కావడంతో నీరు నిలిచి పోయి వెళ్లేలేని పరిస్థితి నెలకొంది. దీంతో కనీస అవసరాలు కోసం బాత్రూంలోకి వెళ్లలన్నా నిలిచిపోయిన నీటిని చూసి వెనక్కు తిరిగి వస్తున్నారు. కొందరు విద్యార్థులు మాత్రం విధిలేని పరిస్థితుల్లో బాత్రూంలో నిలిచిన మురికి నీటిలో నుంచే నడుచుకొని వెళుతున్నారు. నీటిలో నడవలేక చెక్కలు వేసుకొని వాటిపై నడుచుకొంటూ వెళుతున్నారు. సమస్య ఇటీవల పత్రికల్లో ప్రచురించినా అటు అధికారులు గాని ఇటు పాఠశాల ప్రధానోపాధ్యాయులుగానీ స్పందించడంలేదు. ఈ నెల 17 నుండి పదో తరగతి పరీక్షలు ప్రారంభమవుతాయి. అప్పటి వరకు బాత్రూంలో మరమ్మతులు చేయకపోతే పరీక్షలు రాసే విద్యార్థులు అవస్థలు పడక తప్పదు. ప్రస్తుతం కూడా బాలికల పాఠశాలలో దాదాపు 850 చదువుకుంటున్నారు. పాఠశాలలో బాత్రూంలు సరిగా లేకపోవడంతో విద్యార్థులు. తల్లిదండ్రులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల గ్రాంట్‌తో చిన్న చిన్న మరమ్మతులు చేపట్టడం లేదనే ఆరోపణలను విద్యార్థుల తల్లిదండ్రులు చేస్తున్నారు. పత్రికల్లో వచ్చినప్పుడు అధికారులు వచ్చి చూసి వెళ్లుతున్నారే తప్ప వాటికి మరమ్మతులు చేసేందుకు మాత్రం చర్యలు తీసుకోవడం లేదు. దీంతో విద్యార్థుల కష్టాలు వర్ణనాతీతం. బాలిక పాఠశాలలో ఎక్కువ మంది మహిళలే ఉన్నారు. మహిళలు ఎక్కువగా ఉన్న పాంశాలలోనే ఇలాంటి దుస్థితి ఉంటే మరి ఇతర పాంశాలలో ఏవిధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా బాలికల పాఠశాలలో సరిగాలేని బాత్రూంల్లో మరమ్మతులు చేసి విద్యార్థులకు, ఉపాధ్యాయుల కష్టాలను తీర్చాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

పైపు బ్లాక్ కావడంతో బాత్రూంలో నిలిచిన నీరు

అట్టహాసంగా ఆర్యవైశ్య సంఘం ప్రమాణస్వీకారం

నూతనంగా ఎన్నికైనవారిని సన్మానిస్తున్న ఆర్యవైశ్యులు

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె మండల ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం ప్రమాణ స్వీకారం అట్టహాసంగా జరిగింది. ఆదివారం స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య, ఆర్యవైశ్య యువజన సంఘం, వాసవి కల్యాణ మండపం, ఆర్యవైశ్య మహిళా మండలి నూతన అధ్యక్ష కార్యదర్శులకు ప్రమాణ స్వీకారం కార్యక్రమం చేపట్టారు. ఆర్యవైశ్య గౌరవ అధ్యక్షుడు రాయవరం సురేంద్ర ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడుగా తోటం శెట్టి చంద్రశేఖర్, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడుగా రాయవరం వెంకట సుబ్బారావుతోపాటు ఆయా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు కూడా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తోటంశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ నిస్వార్థంగా బంధు, స్నేహ ప్రీతి, ధనాపేక్ష లేకుండా సంఘ నియమ నిబంధనలకు లోబడి ఉంటానని చెప్పారు. ఆర్యవైశ్య సంఘాన్ని బలోపేతం చేయడంతోపాటు కన్యకాపరమేశ్వరి ఆలయాన్ని అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ఆర్యవైశ్యలంతా ప్రమాణ స్వీకారం చేసిన వారందరికి సభ్యులకు అభినందనలు తెలిపారు. నూతన అధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేసిన తోటంశెట్టి చంద్రశేఖర్, వెంకట సుబ్బారావులను టిడిపి నేత జివి రమణ సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు దొంతు సుబ్బారావు, నారాయణ సుబ్రమణ్యం, సెక్రటరీ కాంభోజి సత్య నారాయణ, ఆర్యవైశ్య యువజన సంఘం ఉపాధ్యక్షులు దొంతు నిరంజన్, వడ్లకుంట వీరేంద్రనాథ్, వడ్లకుంట వంశీ, సెక్రటరీ దొంతు సతీష్, ట్రెజరర్ శ్రీకాకుళ మధుసూధన గుప్తా, వాసవి కల్యాణ మండపం సంఘం అధ్యక్షుడు కామిశెట్టి సతీష్ కుమార్, ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు బచ్చు భాగేస్వరమ్మ, ఉపాధ్యక్షులు నిచ్చెనమెట్ల మాధవి పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

కార్మికులకు దుస్తులు అందజేస్తున్న ఎంపిజె నాయకులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

పట్టణంలోని సైదాగారి వీధిలోని మన ప్రజాసేవా సమితి కార్యాలయంలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథి వివిఎస్ ముక్తియార్, ఎంపిజె రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలీం, ఎంపిజె రాయలసీమ ఇన్‌ఛార్జి ఎండి అయూబ్ ఖాన్ 40 మంది పారిశుధ్య కార్మికులకు పంపిణీ చేశారు అనంతరం వారు మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు ఎంతో ఉన్నత స్థానంలో ఉన్నారని, వారిపై ఏదో రూపంలో దౌర్జన్యాలు జరుగుతున్నాయని తెలిపారు. కఠినమైన చట్టాలతో వెంటనే వాటిని అరికట్టాలన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందు ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపిజె జిల్లా అధ్యక్షులు జాకిర్, స్థానిక అధ్యక్షులు హుస్సేన్‌బాషా, ఎంపిజె నాయకులు ముక్తియార్, అస్లాం, సద్భావన సేవా సంఘం కార్యదర్శి శేఖర్, మన ప్రజాసేవా సమితి ఉపాధ్యక్షులు బీటెక్ బాషా, కింగ్ బాషా, వర్కింగ్ ప్రెసిడెంట్ ఖలీద్, ట్రెజరర్ మెహమూద్, సభ్యుడు ఫరన్ పాల్గొన్నారు.

మహిళా కార్మికులకు సన్మానం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం పొద్దుటూరు మున్సిపల్ యూనియన్ (సిఐటియు) నాయకులు మహిళా కార్మికులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కార్యదర్శి విజయ్‌కుమార్ మున్సిపల్ సంఘ కార్యదర్శి సాల్మన్ మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో మహిళలు పెద్దన్న పాత్ర పోషిస్తున్నారన్నారు. మహిళలకు అసాధ్యం అనేది ఏదీ లేదని నిరూపించారన్నారు. మహిళలు ముందుకు వచ్చి హక్కుల పోరాటంలో విజయం సాధించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఖ్య పట్టణ అధ్యక్షులు చంటి, ప్రమీలమ్మ, గురమ్మ, రమాదేవి, శాంతి, నీతమ్మ, అన్నపూర్ణ పాల్గొన్నారు.

మహిళా కార్మికులను సన్మానించిన సంఘ నాయకులు

పలు కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి - తొండూరు

మండలంలోని ఇనగలూరు గ్రామానికి చెందిన ఉపాద్యాయుడు ఈశ్వర్‌రెడ్డి ఆహ్వానం మేరకు ఆదివారం పిల్లల కేశ ఖండన కార్యక్రమానికి ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా టిడిపి కార్యకర్తలతో పలు అంశాలపై చర్చించారు. తెలుగుదేశం నాయకులు కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. అనంతరం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ యువ నాయకులు, నూతన వధూవరులైన విశ్వనాథ్‌రెడ్డిని, ఆయన భార్యను ఆశీర్వదించినారు. పార్టీలో జరుగుతున్న విషయాలపై మండలంలోని సీనియర్ నేతలతో చర్చించారు. కార్యక్రమంలో సైదాపురం నరసింహారెడ్డి, తొండూరు రమణారెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.


ఇనగలూరులో పర్యటిస్తున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

బూచుపల్లి పుల్లారెడ్డి ఆధ్వర్యంలో ఇఫ్తార్

ప్రజాశక్తి - ముద్దనూరు

ఓబుళాపురం గ్రామానికి చెందిన విశ్రాంత అధ్యాపకులు డాక్టర్ బూచూపల్లి పుల్లారెడ్డి ఆధ్వర్యంలో ఆర్‌టిపిపి రోడ్డులోని మసీదులో ముస్లింలకు ఆదివారం ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక పెద్ద దేవరగడ్డ వీధిలో వెలసిన గంగమ్మకు ఆదివారం మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు గంగమ్మకు జలాభిషేకం చేసి చలువ ముద్దను ఏర్పాటు చేసి, బోనాలను నైవేద్యంగా పెట్టారు. ప్రతి ఏడాది ఉగాది దగ్గర పడుతున్న సమయంలో గంగమ్మకు చలువ చేయడం ఆనవాయితీగా వస్తోంది. కార్యక్రమంలో గౌరీదేవి ఆలయ సంఘం ప్రెసిడెంట్ నంబూరు కులాయప్ప, నక్కా. రాజారామ్, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

మీదిపెంట్ల కోటను పర్యాటకంగా మార్చాలి

- పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేముల

స్థానిక మీదిపెంట్ల కోటను పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి ఆదివారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేష్‌తో కలిసి సందర్శించారు. అనంతరం తులసిరెడ్డి మాట్లాడుతూ విజయనగర సామ్రాజ్యంలో పాలేగాళ్ల కోటగా నిర్మించబడిన ఈ మీదిపెంట్ల కోటను ప్రభుత్వం పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలన్నారు. తద్వారా చరిత్రను రాబోయే తరానికి అందించిన వారమవుతామని తెలిపారు. కోటను రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడం వల్లే శిథిలావస్థకు చేరిందన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి వెంటనే ఈ ప్రాంతాన్ని ఒక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో వెంకట నారాయణ, ఉత్తన్న, నాగరాజు పాల్గొన్నారు.

యువతను నమ్మించి మోసగించడం భావ్యమా..!

వేంపల్లె : నిరుద్యోగ యువతను నమ్మించి మోసగించడం భావ్యమా అని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి ముఖ్యమంత్రిని ప్రశ్నించారు. ఆదివారం వేంపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి కూటమి అధికారంలోకి వచ్చే దానికి ప్రధాన కారణం సూపర్‌సిక్స్ హామీలు అన్నారు. ఇందులో ప్రధానమైన హామీ నిరుద్యోగ భృతి అన్నారు. తాము అధికారంలోకి వస్తే నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేలు ప్రభుత్వం ఇస్తుందని సూపర్ సిక్స్ హామీల్లో పేర్కొన్నారని తెలిపారు. రాష్ట్రంలో దాదాపు రూ 20 లక్షల మంది నిరుద్యోగులున్నారన్నారు. ఏప్రిల్ నుంచి నిరుద్యోగ భృతి అమలు చేయాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు.

బాలనారాయణరెడ్డికి ఘన నివాళి

ప్రజాశక్తి - ముద్దనూరు

స్థానిక సుచరిత నర్సింగ్ హోం ప్రముఖ వైద్యులు గంగవరం బాలనారాయణరెడ్డి 15వ వర్ధంతిని ఆయన కుమారుడు డాక్టర్ నవజ్యోత్‌రెడ్డి ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలనారాయణరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఆజాద్‌కు సర్టిఫికెట్లను అందజేస్తున్న డైరెక్టర్ కుమారస్వామి గుప్తా

ఆజాద్‌కు డైరెక్టర్ అభినందనలు

ప్రజాశక్తి - వేంపల్లె

ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటిలో సిఇసి విభాగంలో ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థి ఆజాద్‌ను ఆదివారం డైరెక్టర్ కుమార స్వామి గుప్తా అభినందించారు. బిటెక్ విద్యార్థి ఆజాద్ ప్రతిష్టాత్మకమైనా గూగుల్ సమ్మర్ ఆఫ్ కోడ్ ఇంటర్న్‌షిప్‌ను విజయవంతంగా పూర్తి చేసినట్లు డైరెక్టర్ తెలిపారు. ఇంటర్న్‌షిప్ సమయంలో అజాద్ తన సాంకేతిక నైపుణ్యాలను మెరుగు పరచుకోవడమే కాకుండా రూ.2.50 లక్షలను స్టైఫండ్‌గా అందుకున్నట్లు చెప్పారు. విద్యార్థి కృషికి, గుర్తింపుగా నిలుస్తుందని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా సమర్పించిన వేలాది ప్రాజెక్టుల్లో ఆజాద్ ప్రాజెక్ట్ ప్రత్యేకంగా నిలవడం గర్వకారణమన్నారు. ప్రపంచవ్యాప్తంగా టాప్ 1000 ప్రాజెక్టుల్లో ఒకటిగా నిలిపిందని చెప్పారు. ఇది అభివృద్ధికర్తగా అతని ప్రయాణంలో ఒక గొప్ప సాధనంగా నిలవడం సంతోషంగా ఉందన్నారు. తన అసాధారణ ప్రదర్శనకు, విశేషమైన కృషికి ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటికి గుర్తింపు రావడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్, సిఎస్ఒ హెచ్‌ఓడి చల్లా రత్నకుమారి, అకాడమిక్ డీన్ రమేష్ కైలాష్ ఉన్నారు.

నూతన కార్యవర్గంతో ఎన్‌జిఒ సంఘం నాయకులు

'ఎన్‌జిఒ' మహిళా కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం

- చైర్ పర్సన్‌గా టిఎం.సువర్ణ

ప్రజాశక్తి - చాపాడు

ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం తాలూకా ఎన్‌జిఒ మహిళా కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మైదుకూరు తాలూకా ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి, చంద్రమౌళి, రాఘవయ్య తెలిపారు. మైదుకూరు ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో ఆదివారం జరిగిన సమావేశంలో తాలూకా మహిళా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. ఈ ఎన్నిక కార్యక్రమంలో బద్వేలు డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ వీరమల్లు మల్లేష్‌ను మైదుకూరు తాలూకా ఎపి ఎన్‌జిఒ గౌరవ అధ్యక్షుడిగా సభ్యులు ఎన్నుకున్నారు.

మహిళా కార్యవర్గం..

అధ్యక్షురాలుగా టి.ఎం.సువర్ణ (వైద్య ఆరోగ్య శాఖ, పిహెచ్‌సి, దువ్వూరు) కన్వీనర్‌గా పి.సుజాత (అర్బన్ హెల్త్ సెంటర్ మైదుకూరు), కె.ఉమా (ఎంపిడిఒ ఆఫీసు, మైదుకూరు) ఉపాధ్యక్షులుగా పి.స్వర్ణలత (వైద్య ఆరోగ్య శాఖ), ఎం.యశోద (పశుసంవర్థక శాఖ), ఎన్.వసుంధర, సంయుక్త కార్యదర్శులుగా దీవెనమ్మ, సి.కల్పన, ప్రశాంతిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎన్‌జిఒ నాయకులు, కోశాధికారి లక్కినేని బాబు, ఉపాధ్యక్షులు పెంచల్ రెడ్డి, పివివి ప్రభాకర్, జాయింట్ సెక్రటరీలు, పద్మావతి, రామగుప్తా, తులసమ్మ, ఎన్‌జిఒ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న ఎంఇఒ జాఫర్

గొప్ప పౌరులుగా ఎదగాలి

ప్రజాశక్తి - వేంపల్లె

పదో తరగతి విద్యార్థులు పరీక్షలు బాగా రాసి మంచి ఫలితాలు సాధించి భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడే గొప్ప పౌరులుగా ఎదగాలని ఎంఇఒ సిఎస్ జాఫర్ సాదిక్ సూచించారు. స్థానిక ఉషాకిరణ్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంఇఒ జాఫర్ సాదిక్ మాట్లాడుతూ విద్యార్థి జీవితానికి మార్కులు ఒకటే ప్రామాణికం కాదన్నారు. చదువుతోపాటు జీవితానికి అవసరమైన జ్ఞానసముపార్జన చేయాలని, తద్వారా సమాజ శ్రేయస్సుకు పాటుపడాలని ఆయన సూచించారు. అనంతరం పాఠశాల వ్యవస్థాపకులు గుజ్జుల కృష్ణారెడ్డి పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాసేటప్పుడు పాటించాల్సిన మెలకువలను తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ బిఎస్ రమణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని కోరారు. సమాజాన్ని ప్రభావితం చేసే గొప్ప వ్యక్తులుగా తయారు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

స్థానిక డాక్టర్ వైఎస్ఆర్ ఉలిమెల్ల లేక్‌లో ఆదివారం సాయంత్రం నిర్వహించిన నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. సంసిద్ సతీష్‌రెడ్డి స్కూల్, వేంపల్లి వారి చిన్నారులచే శబరిష్ డ్యాన్స్ మాస్టర్ అధ్వర్యంలో జానపద, శాస్త్రీయ, సినిమా పాటలకు నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ ప్రమీలదేవి, నృత్య శిక్షకుడు శబరిష్, పరిపాలనా అధికారి సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

కడప అర్బన్ : కడప శిల్పారామంలో సాంస్కృతిక కళావేదిక మీద మిస్పా మూవీ వారి సహకారంతో కడప నగరానికి చెందిన కిషోర్ డాన్స్ బృందం కార్యక్రమాలతో అలరించారు. రాధిక రాధిక, వస్తావా జానకి, రాను బొంబాయికి రాను, గోపాల గోపాల అంటూ తమ డాన్స్‌లతో ప్రేక్షకులను ఉత్సాహపరిచారు. జానపదాలు, శాస్త్రీయ, సినీ నృత్యాలను ప్రదర్శించారు. కార్యక్రమాలను శిల్పారామం పరిపాలన అధికారి పి.శివప్రసాద్ రెడ్డి పర్యవేక్షించారు.

కడప అర్బన్ : నృత్య ప్రదర్శనలో చిన్నారులు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పులివెందుల టౌన్ : పట్టణంలోని 33/11 కెవి కోతి సమాధి సబ్‌స్టేషన్ పరిధిలో 11కెవి పార్నపల్లి రోడ్డు, 11కెవి రాజీవ్ నగర్ పీడర్‌కు సోమవారం మరమ్మతులు జరుగుతున్నందున విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎఇ జగదీశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుండి సాయంత్రం ఐదు గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు.